www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

శుక్రవారం మే 01 2026

ninadam.in

## ఉపాధి కూలీలతో కలిసి పనిచేసిన సీతక్క



**ములుగు, మే 1 (నినాదం):**
మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవపూర్‌లో ఉపాధి హామీ పనుల్లో పలుగు పట్టి కార్మికులతో కలిసి మంత్రి సీతక్క పనులు చేశారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని ఉదయం 10 గంటల వరకు పనులు ముగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లాలని కూలీలకు మంత్రి సీతక్క సూచించారు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్
- డ్రగ్స్ నియంత్రణకు మరింత కఠిన చర్యలు

### డిజిపిగా సివి ఆనంద్ ప్రమాణస్వీకారం

*తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు.*





**హైదరాబాద్, మే 1 (నినాదం):**
నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల

02



## ఆర్టీసికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం
- మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట, మే 1 (నినాదం):**
ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరి వారు సమ్మె పట్టించుకోకుండా ఉండలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి

02

## కార్మికుల హక్కుల, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మేడే సందర్భంగా కార్మికులతో బంతి భోజనం ,
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మిర్యాలగూడ మే 1( నినాదం ) :**
కార్మికుల హక్కులు,సంక్షేమాని కై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని (మే డే) పురస్కరించుకొని శుక్రవారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మే డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా





కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు . ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ మే 1 న మే డే వేడుకలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటారని, 145 సంవత్సరాలకు పూర్వం చికాగో నగరంలో కార్మికులు 8 గంటలు పని చేయాలని కోరుతూ ఉద్యమించారని, ఆ సందర్భంలో కార్మికులపై చేసిన దాడి లో రక్తం చిందిన

02

## వాణిజ్య సిలిండర్ ధరల పెంపు...

### ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం

- అంతిమంగా సామాన్యుడిపై భారం పడుతుందని ఆందోళన
- ఎన్నికల తర్వాత ధరల పెంపు మోసం చేయడమేనని వ్యాఖ్య



**హైదరాబాద్, మే 1 (నినాదం):**
కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలు పెంచడం వల్ల ఆ ప్రభావం అంతిమంగా సామాన్యుడిపై పడుతుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య

02

## ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే

- ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం అలవాటుగా మారిందని విమర్శ
- రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్న కేటీఆర్
- కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డికి పట్టడం లేదన్న కేటీఆర్
- రాహుల్ గాంధీ ఆటో ఎక్కితే, ఆ డ్రైవర్ తన రెండు ఆటోలు అమ్ముకున్నాడని వ్యాఖ్య




**హైదరాబాద్, మే 1 (నినాదం):**
ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో ఎన్నడూ

02

## కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారు

- చెరువులను కబ్జాల నుంచి విముక్తి చేస్తే కేసీఆర్ కు వచ్చిన ఇబ్బంది ఏమిటన్న మహేశ్
- హైడ్రా నిబంధనలను కేసీఆర్ చదువుకోవాలని హితవు
- రాజకీయ ఉనికి కోసమే కేసీఆర్ బయటకు వస్తున్నారని ఎద్దేవా

**హైదరాబాద్, మే 1 (నినాదం):**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని చెరువుల కబ్జాల విముక్తి కోసం ప్రభుత్వం చేపట్టిన హైడ్రా చర్యలపై కేసీఆర్ అభ్యంతరం చెప్పడాన్ని పీసీసీ చీఫ్ తప్పుపట్టారు. నగరం చుట్టూ ఉన్న చెరువులను బీఆర్ఎస్ నాయకులే కబ్జా

02



## రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర...

- మూడు నెలల కాలంలో 81 శాతం పెరిగిందన్న రాహుల్ గాంధీ
- ఈ ధర పెంపు ఎన్నికల బిల్లు అని చురక
- తీవ్రంగా స్పందించిన రాహుల్ గాంధీ

02



## కోల్‌కతాలో హైడ్రామా.. అర్ధరాత్రి స్ట్రాంగ్‌రూమ్‌కు సీఎం మమత

- కోల్‌కతాలో మూడు గంటలకు పైగా స్ట్రాంగ్‌రూమ్ వద్దే ఉన్న సీఎం
- 4న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు




**కోల్‌కతా మే 1 (నినాదం):**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఈవీఎంల భద్రత విషయంలో తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలకు తెగించి పోరాడతామని ఆమె స్పష్టం

02

# ఎమ్మెల్యేల కంటే ప్రజల పక్షానే ఉంటా..

## 22 నెలల్లో రూ.63 వేల కోట్లు పెన్షన్లకు ఖర్చు

- మేడే సందర్భంగా పమిడిముక్కలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- కార్మికుల కోసం రాష్ట్రంలో 15 చోట్ల వసతులతో కూడిన లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- గత 22 నెలల్లోనే పింఛన్ల కోసం రూ.63 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని వెల్లడి
- పునరుద్ధరించిన కార్మిక సంక్షేమ పథకాలు, కొత్త ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణంపై హామీ
- ప్రజలతోనే తన నిబద్ధత అని, ఎమ్మెల్యేల పనితీరును సమీక్షిస్తానని స్పష్టీకరణ




**కృష్ణా జిల్లా, మే 1 (నినాదం):**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా సీఎం చంద్రబాబు కార్మికులకు అండగా నిలుస్తూ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 15 ముఖ్య ప్రాంతాల్లో కార్మికుల కోసం ప్రత్యేకంగా 'లేబర్ అడ్డాలు' ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. నేడు కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని పమిడిముక్కలలో జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు 'శ్రమ శక్తి' పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ... ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేలా అన్ని వసతులతో ఈ లేబర్



అడ్డాలను నిర్మిస్తామని తెలిపారు. ఇవి కేవలం కార్మికులు సేద తీరే షెల్టర్లుగానే కాకుండా, వారి నైపుణ్యాన్ని పెంచే 'స్కిల్ డెవలప్‌మెంట్' కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని వివరించారు. ఆధునిక పనిముట్లు అందించి, శిక్షణ ఇవ్వడం ద్వారా కార్మికుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్నదే తమ ప్రభుత్వ

02

## ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

- రూ.1,745 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం
- ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా వెల్లడి



**ముంబయి, మే 1 (నినాదం):**
ముంబయిలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ. 1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబయిలో

02

## నా బయోపిక్ తీయాలని ఉంది..

### నేనే తీస్తా - మల్లారెడ్డి

- తన పాత్రకు ఏ హీరో సెట్ అయితే ఆయనను తీసుకుంటామని వెల్లడి

**హైదరాబాద్, మే 1 (నినాదం):**
తెలంగాణ రాజకీయాల్లో తనదైన ట్రేడ్ మార్క్ స్పీచ్‌లతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఇప్పుడు సినిమాల గురించి చేసిన

02



# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

శుక్రవారం మే 01 2026

ninadam.in




## ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి.. దానినుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికి గాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా.. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

## ఆర్టీసికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు. ఈ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించామని స్పష్టం చేశారు. త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పక్రియను గుర్తింపు పొందిన సంఘం అధికారుల కమిటీ పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామని అన్నారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, కేబినెట్ మంత్రులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 380 రూట్‌లలో కొత్తబస్సులు నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. 7 లక్షల మంది ప్రయాణికులకు కనెక్టివిటీ పెంచామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రిగా.. ప్రభుత్వానికి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఏవిధంగా పోరాడామో సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

## వాణిజ్య సిలిండర్ ధరల పెంపు...

సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచారని, దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, వీధి వ్యాపారులు, బేకరీలపై పెను భారం పడుతుందని అన్నారు. ఇది సామాన్యులకు ఆర్థిక భారమే అన్నారు. ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడమంటే ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఈరోజు భారీగా పెరిగిన విషయం తెలిసిందే.

## నా బయోపిక్ తీయాలని ఉంది..


వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన జీవితకథను సినిమాగా తీయాలని ఉందని... ఆ సినిమాను తానే తీస్తానని ఆయన అన్నారు. పవన్ కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'లో విలన్ పాత్ర కోసం తనను సంప్రదించారని... తాను ఒప్పుకోలేదని మల్లారెడ్డి చెప్పారు. విలన్ అంటే హీరో చేతిలో దెబ్బలు తినాల్సి ఉంటుందని, వేలాది మంది తన విద్యార్థులు, అభిమానుల ముందు అలా కనిపించడం తనకు ఇష్టం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను త్వరలోనే సినిమాల్లోకి వస్తానని మల్లారెడ్డి తెలిపారు. తన పాత్రకు ఏ హీరో సెట్ అవుతారని డైరెక్టర్ చెబుతారో ఆయననే తీసుకుంటామని... ఆ సినిమాలో తాను కూడా ఒక ప్రధాన పాత్రలో నటిస్తానని చెప్పారు.

## కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారు

చేశారని, అందుకే హైడ్రా వల్ల ఆ పార్టీ నేతలకు ఇబ్బంది కలుగుతోందని ఎద్దేవా చేశారు. చెరువులను కబ్జాల నుండి విముక్తి చేస్తే కేసీఆర్ కి వచ్చిన ఇబ్బంది ఏంటని ఆయన నిలదీశారు. హైడ్రా నిబంధనల గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవు పలికారు. టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత వల్లే కేసీఆర్ మళ్లీ మేల్కొంటున్నారని, ఆమె భయం వల్లే ఆయన బయటకు వస్తున్నారని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కవితకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ ప్రజల కోసం కాకుండా రాజకీయ ఉనికి కోసమే బయటకు వస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేస్తున్నామని చెబుతూనే, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా మహేశ్ గౌడ్ కొన్ని కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని, దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని తెలిపారు. ఇక అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం తీసుకునే అధికారం పూర్తిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని ఆయన స్పష్టం చేశారు.

## కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై మరోసారి స్పందించిన మల్లికార్జున ఖర్గే

### సిద్ధరామయ్య సీఎంగా కొనసాగుతారని వ్యాఖ్య



**బెంగుళూరు, మే 1 (నినాదం) :**
కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే మరోసారి స్పందించారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ఉండబోదని తెలిపారు. నాయకత్వ సమస్యపై నెలకొన్న గందరగోళాన్ని పార్టీ అధిష్ఠానం కూడా త్వరలోనే నివృత్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిద్ధరామయ్య సీఎంగా కొనసాగుతారని, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉండవచ్చని చెప్పారు. కర్ణాటక కాంగ్రెస్ నాయకులు తనను, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి తమ అభిప్రాయాలను పంచుకున్నారని తెలిపారు. లోక్ సభలో ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు సరైన సమయంలో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. మల్లికార్జున ఖర్గే ముఖ్యమంత్రి పదవి చేపడితే స్వాగతిస్తామని కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర అన్నారు. ఈ ప్రకటనపై కూడా ఖర్గే స్పందించారు. ముఖ్యమంత్రి కుర్చీ ఖాళీగా లేదని, కాబట్టి అలాంటి చర్చకు తావులేదని స్పష్టం చేశారు. తాను ముఖ్యమంత్రి కావాలని జి. పరమేశ్వరకు ఉండవచ్చు, మీరు (విలేకరులు) స్వాగతించవచ్చు, ఎవరైనా అంగీకరించవచ్చు కానీ ఈ విషయాలను నిర్ణయించేది సోనియా గాంధీ అని తెలిపారు.

# విశాఖ ఉక్కుకు మరో భారీ ఊరట.. రూ. 8,097 కోట్ల అదనపు ప్యాకేజీకి కేంద్రం సిద్ధం!

- ఇప్పటికే తొలి దశలో రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందించిన కేంద్రం
- రెండో దశ ప్యాకేజీ ఫైల్ ను ఇప్పటికే క్లియర్ చేసిన కుమారస్వామి
- విశాఖ ప్లాంట్ లో గణనీయంగా పెరిగిన ఉత్పత్తి, అమ్మకాలు




**విశాఖపట్నం, మే 1 (నినాదం) :**
ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కి, ప్రస్తుతం నిలకడగా కొనసాగుతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రెండో విడత ఆర్థిక ప్యాకేజీని ప్రకటించనుంది. గత ఏడాది అందించిన రూ. 11,440 కోట్ల సాయానికి అదనంగా, ఇప్పుడు మరో రూ. 8,097 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర ఉక్కు శాఖ రంగం సిద్ధం చేసింది. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఈ ప్యాకేజీకి సంబంధించిన ఫైల్‌ను ఇప్పటికే క్లియర్ చేశారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపించారు. ఆర్థిక శాఖలోని వ్యయ విభాగం దీనికి పచ్చజెండా ఊపిన వెంటనే, ఈ అంశం తుది ఆమోదం కోసం కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లనుంది. తొలి దశలో అందించిన సాయం తరహాలోనే, ఈ రూ. 8,097 కోట్లను కూడా ఈక్విటీ రూపంలోనే సమకూర్చాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల ప్లాంట్‌పై రుణ భారం పడకుండా, మూలధనం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిపిన సంప్రదింపులతో తొలి దశలో రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందింది. ఇందులో రూ. 10,300 కోట్లు ఈక్విటీగా, మిగిలిన రూ. 1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ రుణాల రూపంలో అందాయి. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి రావడంతో కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఉక్కు ఉత్పత్తి, అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఈ పురోగతి దీర్ఘకాలం పాటు కొనసాగాలంటే అదనపు నిధుల అవసరం ఉందని గుర్తించిన కేంద్రం, ఈ రెండో దశ ప్యాకేజీ ద్వారా ప్లాంట్‌ను పూర్తిస్థాయి లాభాల బాటలోకి తీసుకురావాలని భావిస్తోంది.

## శంషాబాద్ ఓఆర్ఆర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురి మృతి

- ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16 వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
- లారీని ఢీకొట్టి నుజ్జునుజ్జయిన కారు
- మృతుల్లో మహిళలు, చిన్నారులు
- మరొకరి పరిస్థితి విషమం.. ఆసుపత్రికి తరలింపు



**హైదరాబాద్, మే 1 (నినాదం):**
హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ వద్ద టర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై వేగంగా వచ్చిన ఓ కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. టీఎస్ 23ఎఫ్ 2298 నెంబర్ కలిగిన మారుతి సుజుకీ వాగనార్ కారు పెద్దగోల్కొండ నుంచి శంషాబాద్ వెళుతోంది. వేగంగా దూసుకొచ్చిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి నుజ్జునుజ్జయింది. దీంతో లారీకి వెనుక భాగంలో ఇరుక్కుపోయింది. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఏడుగురు ఉన్నారు. ఘటనాస్థలంలోనే ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కొన ఊపిరితో ఉన్న మరొకరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## గుంటూరులో మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం... నలుగురి అరెస్ట్


- గుంటూరులోని స్పా సెంటర్‌పై టాస్క్ ఫోర్స్ దాడి
- స్పా ముసుగులో వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తింపు
- ముగ్గురు మహిళలు, ఒక మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పట్టుబడిన వారిలో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులు
- కేసు తదుపరి విచారణ కోసం నల్లపాడు పోలీసులకు అప్పగింత



**గుంటూరు మే 1 (నినాదం):**
గుంటూరు నగరంలో స్పా, మసాజ్ సెంటర్ ముసుగులో జరుగుతున్న వ్యభిచార దందాను గుంటూరు జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు, రెడ్డిపాలెం వద్ద ఉన్న 'ఐరా స్పా' సెంటర్‌పై గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముగ్గురు మహిళలతో పాటు స్పా మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల నుంచి అందిన పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ బృందం గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈ స్పా సెంటర్‌పై ఆకస్మిక దాడి చేసింది. కొంతకాలంగా మసాజ్ పేరుతో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో స్పా మేనేజర్‌గా పనిచేస్తున్న సూర్య అనే వ్యక్తితో పాటు ముగ్గురు మహిళలను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన మహిళల్లో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని విచారణలో తేలింది. అనంతరం, అదుపులోకి తీసుకున్న నలుగురిని తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఆన్‌లైన్ బేరాల వెనుక ఉన్న అసలు రంగు ఇదే

- ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను హెచ్చరించిన టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- ఆర్మీ, పోలీస్ ఆఫీసర్లమని నమ్మించి మోసం చేస్తున్నారని వెల్లడి
- వైజాగ్ పోలీసుల అవగాహన వీడియోను షేర్ చేసిన ఎంపీ
- మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచన
- ఉచితంగా, తక్కువ ధరలకు వచ్చే వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపు



**అమరావతి, మే 1 (నినాదం) :**
ఆన్‌లైన్ వేదికగా జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ ఎంపీ, లోక్‌సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. సెకండ్ హ్యాండ్ వస్తువుల పేరుతో సైబర్ నేరగాళ్లు అమాయకులను ఎలా దోచుకుంటున్నారో వివరిస్తూ ఆయన ఒక కీలకమైన పోస్ట్ చేశారు. వైజాగ్ సిటీ పోలీసులు రూపొందించిన అవగాహన వీడియోను షేర్ చేస్తూ, ఆన్‌లైన్ బేరాల వెనుక ఉన్న ప్రమాదాలను ఆయన ఎత్తిచూపారు. "ఉచితంగా ఏదీ రాదు, తక్కువ ధరకు అంతకన్నా రాదు" అని గుర్తుంచుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఓఎల్ఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో కొందరు కేటుగాళ్లు తాము ఆర్మీ లేదా పోలీస్ అధికారులమని చెప్పి, నకిలీ ఐడీ కార్డులు చూపిస్తూ నమ్మబలుకుతున్నారని తెలిపారు. తక్కువ ధరకే వస్తువులు అమ్ముతామని చెప్పి, డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నారని వివరించారు. ఇలాంటి మోసాల బారిన పడి కష్టార్జితాన్ని కోల్పోవద్దని ఆయన హెచ్చరించారు. ఒకవేళ పొరపాటున సైబర్ మోసగాళ్ల చేతిలో డబ్బులు కోల్పోతే ఏమాత్రం ఆలస్యం చేయవద్దని ఆయన సూచించారు. మోసపోయినట్టు గ్రహించిన మొదటి గంట అత్యంత కీలకమని, వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కు ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. ఈ సమాచారాన్ని అందరికీ షేర్ చేసి, ఇతరులను కూడా కాపాడాలని ఆయన కోరారు.

## అధ్యక్ష పీఠంపై అసిమ్ మునీర్ కన్ను..

- భారత్‌పై భారీ ఉగ్రదాడికి పాక్ కుట్ర!



**ఢిల్లీ మే 1 (నినాదం) :**
భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని విశ్వసనీయ నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్ ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీనివల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికి పాల్పడటం వారి వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా ఫర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, ఆయనకు కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని విశ్లేషకులు చెబుతున్నారు.

## నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

## కార్మికుల హక్కుల, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

సందర్భాలకు గుర్తుగా మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారని తెలిపారు. భారత దేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో కార్మికులు అణగారిన వర్గాల వారి హక్కుల రక్షణ, అభివృద్ధికి కృషి చేశారని, కార్మికుల సంక్షేమంపై వారి హక్కుల గురించి బ్రిటిష్ పరిపాలనలోని వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లారని ,భారత దేశంలో సైతం కార్మికులు 8 గంటల పని చేసేలా కౌన్సిల్ వద్ద పోరాటం చేశారని తెలిపారు. అనంతరం స్వాతంత్రం సాధించుకున్న భారత దేశంలో రాజ్యాంగంలో కార్మికుల హక్కులు, చట్టాల రూపంలో కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దే అని అన్నారు. పురుష కార్మికులతో పాటు ,మహిళలకు కూడా మొట్టమొదటిసారిగా మెటర్నిటీ లీవ్ ను ఏర్పాటు రాజ్యాంగం ద్వారా పొందుపరిచారని, అలాగే ఇంట్లో పని చేసే వారికి కూడా మెటర్నిటీ లీవ్ ఇచ్చే విధంగా హక్కులు కల్పించారని తెలిపారు. స్వాతంత్రం రాకముందు వైస్రాయ్ కౌన్సిల్ లో హిందూ కోడ్ బిల్ పొందుపరిచేందుకు పోరాటం చేశారని ,1955 హిందూ వివాహ చట్టం, 1956 హిందూ వారసత్వ చట్టం ద్వారానే మహిళలకు హక్కులతో పాటు, వివాహ హక్కు, ఆస్తి హక్కు వంటివి కల్పించబడ్డాయని తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని అన్నారు. స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , నల్లగొండ డిసిసి అధ్యక్షులు ఉన్న కైలాస్ నేత, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలకృష్ణ, చిరుమర్రి కృష్ణయ్య, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే

లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు. హామీల గురించి అడిగితే బూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎలాగూ మరోసారి ముఖ్యమంత్రి కాబోరని, కానీ ఉన్నన్నాళ్లైనా నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి లెక్కలేదని అన్నారు.

రాహుల్ గాంధీ అడుగు పెడితే ఉన్న ఆటోలు అమ్ముకున్నాడు

తాను కొన్ని కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయం వద్ద కారు అందుబాటులో లేకపోవడంతో మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోను ఎక్కానని తెలిపారు. ఆ సమయంలో ఆయనతో మాట్లాడానని, ఆయన చెప్పిన విషయాల విని ఆందోళన చెందానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే మస్రత్ అలీ ఆటోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కారని, ఆ సమయంలో అతనికి రెండు ఆటోలు ఉండేవని చెప్పారు. రాహుల్ గాంధీ ఎక్కిన తర్వాత ఆయన తన ఆటోలను అమ్మేసుకుని కిరాయి ఆటో నడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కొందరి అడుగు అలా ఉంటుందని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు.


## రూ.993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర...

**ఢిల్లీ మే 1 (నినాదం) :**
వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కేవలం మూడు నెలల్లోనే వాణిజ్య సిలిండర్ ధరను 81 శాతం పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఒక్కరోజులోనే రూ.993 పెంచారని, ఇది కచ్చితంగా ఎన్నికల బిల్లు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయని తాను ముందే హెచ్చరించానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకు నిదర్శనమే నేడు వాణిజ్య సిలిండర్ ధర పెంపు అని తెలిపారు. రూ.993 పెరగడమంటే, ఇది ఒకరోజులో నమోదైన అతిపెద్ద పెరుగుదల అని ఆయన అన్నారు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు ధర రూ.1,380 పెరిగిందని ఆరోపించారు. అంటే గత మూడు నెలల కాలంలో 81 శాతం పెరుగుదల నమోదైనట్లు చెప్పారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం వల్ల ఈ ప్రభావం చిన్న చిన్న వ్యాపారులపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చాయ్-టిఫిన్ డబ్బాలు, హోటళ్లు, బేకరీలు, మిఠాయి దుకాణాలు తదితర వాటిపై ప్రభావం పడుతుందని అన్నారు. తద్వారా ఇది సామాన్యులకు కూడా భారంగా మారుతుందని అన్నారు. నేటి ధరల పెంపుతో 19 కేజీల వాణిజ్య సిలిండర్ రూ.3 వేలకు పైగా ధర పలుకుతోంది.

## కోల్‌కతాలో హైడ్రామా.. అర్ధరాత్రి స్ట్రాంగ్‌రూమ్‌కు సీఎం మమత

చేశారు. ఈవీఎంల భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె స్వయంగా కోల్‌కతాలోని ఓ స్ట్రాంగ్‌రూమ్ వద్ద మూడు గంటలకు పైగా ఉన్నారు. దక్షిణ కోల్‌కతాలోని సాఖావత్ మెమోరియల్ స్కూల్‌లో భవానీపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్‌రూమ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, బ్యాలెట్ బాక్సులను తెరుస్తున్నారని టీఎంసీ ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియోలు టీవీలో చూసిన తర్వాత మమతా బెనర్జీ గురువారం రాత్రి నేరుగా అక్కడికి చేరుకున్నారు. భవానీపూర్ అభ్యర్థిగా తనకున్న హక్కుతో స్ట్రాంగ్‌రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈవీఎం యంత్రాన్ని దొంగిలించడానికి లేదా కౌంటింగ్‌ను తారుమారు చేయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే మేం ప్రాణాలకు తెగించి పోరాడతాం" అని హెచ్చరించారు. తనను మొదట సెంట్రల్ ఫోర్సెస్ సిబ్బంది అడ్డుకున్నారని, కానీ ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థిగా తనకు ఉన్న హక్కును వినియోగించుకుని లోపలికి వెళ్లానని తెలిపారు. అయితే, టీఎంసీ ఆరోపణలను ఎన్నికల కమిషన్ (ఈసీ) తోసిపుచ్చింది. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు పనిచేస్తున్నాయని, పార్టీల ప్రతినిధులకు లైవ్ ఫుటేజీ అందుబాటులో ఉందని స్పష్టం చేసింది. మరోవైపు, బీజేపీ దీన్ని మమత ఆడుతున్న "డ్రామా"గా అభివర్ణించింది. కాగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4న జరగనుంది.

## ఎమ్మెల్యేల కంటే ప్రజల పక్షానే ఉంటా..



లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 88 లక్షల మంది అసంఘటిత కార్మికులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సంక్షేమానికి పెద్దపీట: చంద్రబాబు**

సంక్షేమ పథకాల అమలులో ఎన్డీఏ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో 62.47 లక్షల మందికి ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నామని, గత 22 నెలల్లోనే పింఛన్ల కోసం రూ.63 వేల కోట్లకు పైగా ఖర్చు చేశామని వివరించారు. ఏడాదికి రూ.33 వేల కోట్లు కేవలం పింఛన్లకే కేటాయిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని, దీనిని భారంగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 263 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలకు రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కార్మిక సంక్షేమ పథకాలకు మళ్లీ జీవం పోశామని తెలిపారు. నిర్మాణ రంగ కార్మికుడి వివాహానికి రూ.25 వేలు, ప్రసూతి సాయంగా రూ.20 వేలు, సాధారణ మరణానికి రూ.60 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికుల సౌకర్యార్థం అచ్యుతాపురం, గుంటూరు, శ్రీసిటీ, కర్నూలుతో పాటు రాజధాని అమరావతిలోనూ కొత్త ఈఎస్ఐ ఆసుపత్రులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.


**ప్రజలతోనే నా నిబద్ధత**

గత ప్రభుత్వ హయాంలో ప్రజలు స్వేచ్ఛగా తిరిగే, నవ్వే పరిస్థితి లేదని, ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రానికి మరో స్వాతంత్ర్యం వచ్చిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తాను, పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఇచ్చిన మాట కోసం గత 22 నెలలుగా నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. "నా నిబద్ధత ప్రజలతోనే. ఎమ్మెల్యేల తరఫున నేను ఉండను, ప్రజల పక్షానే ఉంటాను. వారి పనితీరును ప్రజల సమక్షంలోనే సమీక్షిస్తాను" అని తేల్చిచెప్పారు. పోలవరం, అమరావతి వంటి ప్రాజెక్టులతో కార్మికులకు చేతినిండా పని కల్పిస్తూ, తెలుగు జాతిని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టడమే తన ధ్యేయమని చంద్రబాబు పేర్కొన్నారు.

EVENING 6 PM
03
# నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
డిజిటల్ ఎడిషన్
శుక్రవారం మే 01 2026
ninadam.in

## వైసీపీ హయాంలోనే ఎక్కువ సంక్షేమం జరిగిందని నిరూపించే దమ్ము జగన్ అండ్ కోకు ఉందా?

- కారకంపాడులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందజేసిన పార్థసారథి, వర్ల కుమార్ రాజా



**కృష్ణా జిల్లా, మే 1 (నినాదం):** మేడే సందర్భంగా కృష్ణా జిల్లాలో పర్యటించిన మంత్రి కొలుసు పార్థసారథి వైసీపీ అధినేత జగన్ పై విమర్శలు గుప్పించారు. జగన్, వైసీపీ నేతలు అబద్ధాలను నిజం చేసేలా 'గోబెల్స్' ప్రచారం చేస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం కంటే వైసీపీ హయాంలోనే ఎక్కువ సంక్షేమం జరిగిందని నిరూపించే దమ్ము జగన్ అండ్ కోకు ఉందా? అని ఆయన సవాల్ విసిరారు. ఏ గ్రామానికైనా వచ్చి చర్చించడానికి తాము సిద్ధమని స్పష్టం చేశారు. మేడే సందర్భంగా మొవ్వ మండలం కారకంపాడులో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి మంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెల 1వ తేదీని ఒక కార్యక్రమంగా భావించి పేదలకు పింఛన్లు అందజేస్తున్నారని, కూటమి ప్రభుత్వం పేదల సేవకే అంకితమైందని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పిల్లల భవిష్యత్తే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. అందరికీ అమ్మ ఒడి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక జగన్ మడమ తిప్పారని పార్థసారథి ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉండేవని, ఇప్పుడు కూటమి పాలనలో మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు వేస్తూ రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు.

## అమరావతిలో బసవతారకం ఆసుపత్రి పనులు ప్రారంభం..

- తుళ్లూరు వద్ద బసవతారం ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించిన బాలకృష్ణ
- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామన్న బాలయ్య
- అమరావతికి భూములిచ్చిన రైతులు, మహిళలకు ధన్యవాదాలు తెలిపిన బాలకృష్ణ



**అమరావతి, మే 1 (నినాదం) :** దశాబ్దాలుగా క్యాన్సర్ బాధితులకు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి అసమాన సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచే సేవలను అందించిన బసవతారకం ఆసుపత్రి... ఇప్పుడు ఏపీకి విస్తరిస్తోంది. ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో తుళ్లూరు వద్ద బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. బసవతారకం ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... అమరావతి నిర్మాణం కోసం వేల ఎకరాల భూములను ఇచ్చిన రైతులకు, మహిళలకు పాదాభివందనం చేస్తున్నానని బాలయ్య అన్నారు. వారి సహకారం వల్లే ఇలాంటి భారీ ప్రాజెక్టులు సాధ్యమవుతున్నాయని ఆయన చెప్పారు. ఈ రోజు స్వాతి నక్షత్రం అని, అది తన తండ్రి ఎన్టీఆర్, తన ఇష్టదైవం నరసింహ స్వామి పుట్టిన నక్షత్రమని... ఈ రోజే పనులు ప్రారంభించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో అమరావతిలో ఆసుపత్రిని నిర్మిస్తున్నామని బాలయ్య తెలిపారు. హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో జూన్ 22న భారీ కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, కేంద్ర మంత్రులను ఆహ్వానించబోతున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణం అనేది హడావుడిగా చేసేది కాదని, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రణాళికాబద్ధంగా చేస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు తొలి దశలో... 7 అంతస్తులతో, 500 పడకల సామర్థ్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించనున్నారు. దాదాపు రూ. 650 కోట్ల భారీ వ్యయంతో ఈ దశను పూర్తి చేయబోతున్నారు. 2028 నాటికి ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## విద్యాశాఖలో లోకేశ్ మార్క్.. ఫొటోల్లేకుండానే విద్యార్థుల ఫలితాల ప్రకటన

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫలితాలతో వినూత్న ప్రచారానికి శ్రీకారం
- సీఎం, మంత్రి ఫొటోలు లేకుండా విద్యార్థుల ఫొటోలతోనే పేపర్ ప్రకటనలు
- రాజకీయాలకు అతీతంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దడమే లక్ష్యమన్న లోకేశ్
- ప్రభుత్వ పథకాలకు డొక్కా సీతమ్మ, సర్వేపల్లి వంటి మహనీయుల పేర్లు
- స్కూల్ వస్తువులపై నేతల ఫొటోలు, పార్టీ రంగులు ఉండవన్న మంత్రి

**అమరావతి, మే 1 (నినాదం) :** ఏపీ విద్యావ్యవస్థలో నూతన శకానికి నాంది పలుకుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను చాటిచెబుతూ, రాజకీయాలకు అతీతంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ఆయన కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వివరాలతో ప్రముఖ దినపత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనలు ఇవ్వడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సాధారణంగా ప్రభుత్వ ప్రకటనలంటే ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల ఫొటోలు, ప్రభుత్వ నినాదాలతో నిండి ఉంటాయి. కానీ, ఈ ప్రకటనలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. వీటిలో ఎక్కడా సీఎం చంద్రబాబు నాయుడు గానీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు గానీ కనిపించవు. కేవలం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలు, వారు చదివిన ప్రభుత్వ పాఠశాలల వివరాలను మాత్రమే ప్రముఖంగా ప్రచురించారు. "ప్రభుత్వ విద్యాలయాలు సగర్వంగా నిలబడి" అనే ఆత్మవిశ్వాసం మినహా ఎలాంటి రాజకీయ ప్రచార ఆర్భాటాలకు తావివ్వలేదు. ఈ విధానం ద్వారా విద్యార్థుల ప్రతిభకే అసలైన గుర్తింపు ఇస్తున్నామనే స్పష్టమైన సందేశాన్ని ప్రభుత్వం పంపింది.

**రాజకీయాలకు దూరం.. మహనీయులకు దగ్గర**

విద్యా రంగాన్ని రాజకీయ రంగులకు దూరంగా ఉంచాలనేది తన ప్రధాన లక్ష్యమని మంత్రి లోకేశ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే స్పష్టం చేస్తున్నారు. ఈ ఆలోచనకు అనుగుణంగానే ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' అని, విద్యార్థులకు మార్గనిర్దేశం చేసే కార్యక్రమానికి 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' అని నామకరణం చేశారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి స్ఫూర్తిప్రదాతల పేర్లను ఇతర పథకాలకు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంతేగాక విద్యార్థులకు అందించే పుస్తకాలు, దుస్తువులు, ఇతర వస్తువులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలు గానీ, కూటమి ప్రభుత్వ రంగులు గానీ ముద్రించవద్దని లోకేశ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.




పారదర్శకత, జవాబుదారీతనం లక్ష్యంగా విద్యాశాఖను నడపాలని ఆయన భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సుశిక్షితులైన ఉపాధ్యాయుల ద్వారా "అమ్మలా శిక్షణ, నాన్నలా రక్షణ" అందిస్తామని, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఈ ప్రకటనల ద్వారా తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ చర్యల ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలను నిలపాలన్న మంత్రి లోకేశ్ సంకల్పం స్పష్టంగా కనిపిస్తోంది.

## శ్రీసత్యసాయి జిల్లాలో భారీ సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు

- ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడి
- ఈ ప్రాజెక్టుతో 1,000 మందికి పైగా ఉపాధి అవకాశాలు
- పుట్టపర్తి సమీపంలో ఏరోస్పేస్ పరిశ్రమ ఏర్పాటుకు కూడా సన్నాహాలు
- రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్న సీఎం

**శ్రీసత్యసాయి, మే 1 (నినాదం) :** ఏపీలోని రాయలసీమ ప్రాంతం పారిశ్రామికంగా పరుగులు పెట్టనుంది. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా ఏకంగా రెండు భారీ పరిశ్రమలు కొలువుదీరబోతున్నాయి. అత్యాధునిక సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌తో పాటు ఏరోస్పేస్ పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ముందుకు వస్తున్న ఈ ప్రాజెక్టులు, ఈ ప్రాంత పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. వివరాల్లోకి వెళితే... శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ భారీ సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమను నెలకొల్పనుంది. రాష్ట్రంలోనే ఇది రెండో అతిపెద్ద సెమీకండక్టర్ పరిశ్రమ కానుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలిదశలో రూ.3,267.69 కోట్లు, రెండో దశలో రూ.6,972.09 కోట్ల చొప్పున మొత్తం రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నారు. ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 1,017 మందికి ప్రత్యక్షంగా




ఉపాధి లభించనుంది. తొలి దశ ప్రాజెక్టు కోసం చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద 30 ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద అనుమతులు పొందేందుకు కంపెనీ ప్రయత్నాలు చేస్తోంది. సెమీకండక్టర్ పరిశ్రమే కాకుండా పుట్టపర్తి సమీపంలో మరో భారీ ఏరోస్పేస్ పరిశ్రమ కూడా రాబోతోంది. డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లలో భాగంగా ఈ పరిశ్రమ రూపుదిద్దుకోనుంది. భవిష్యత్తులో ఈ రంగంలో రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ఈ రెండు ప్రాజెక్టులను ప్రస్తావించారు. రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే కంపెనీలకు అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తున్న పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ రెండు కీలక ప్రాజెక్టులతో సత్యసాయి జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కీలక మైలురాయిని చేరుకోనుంది.

## వద్దని బతిమాలినా, వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశారు

- కేసీఆర్ అహంకారం నచ్చకపోవడం వల్లే నాయకులు దూరం జరుగుతున్నారని వ్యాఖ్య
- నాడు రాజీనామా చేయకుండా బీఆర్ఎస్‌లో చేరిన వారికి కేసీఆర్ మంత్రి పదవులు ఇచ్చారని ఆగ్రహం



**వరంగల్ మే 1 (నినాదం) :** వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరుముక్కలు చేశారని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. జిల్లాను ముక్కలు చేయవద్దని తాను బతిమాలినప్పటికీ, ఆరు ముక్కలు చేసి ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పైకి వరంగల్ జిల్లా అని చెప్పుకోవడం తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ అహంకారం నచ్చకపోవడంవల్లే కొందరు నాయకులు దూరంగా ఉంటున్నారని అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 36 మంది ఎమ్మెల్యేలను ఇతర పార్టీల నుంచి చేర్చుకున్నారని విమర్శించారు. పార్టీలో చేరిన వారు ఎవరూ రాజీనామా చేయకపోయినప్పటికీ మంత్రి పదవులు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. మీరు చేస్తే రాజకీయం, ఇతరులు చేస్తే వ్యభిచారమా అని నిలదీశారు. ఇది కేసీఆర్ నేర్పిన విద్యే అన్నారు. కేసీఆర్ తీరు నచ్చకపోవడం వల్లే ఆయన నాయకత్వం నుంచి చాలామంది బయటకు వస్తున్నారని అన్నారు. కేసీఆర్ అహంకారం ఎవరికీ నచ్చడం లేదని అన్నారు.

## బీజేవైఎం నేత హత్య కేసు ఆరుగురికి మరణశిక్ష విధించిన కోర్టు

- బీజేపీ యువమోర్చా నేత వెంకటేశ్ కురుబర హత్య కేసులో సంచలన తీర్పు
- ఆరుగురు దోషులకు మరణశిక్ష విధించిన గంగావతి కోర్టు

**కొప్పల్ మే 1 (నినాదం) :** కర్ణాటకలో సంచలనం సృష్టించిన బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) నేత వెంకటేశ్ కురుబర (34) హత్య కేసులో స్థానిక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో





ఆరుగురు దోషులకు మరణశిక్ష విధిస్తూ కొప్పల్ జిల్లా గంగావతి కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. గంగావతి కోర్టు జడ్జి సదానంద నాగప్ప నాయక్ ఈ తీర్పును ప్రకటించారు. దోషులుగా తేలిన రవి, విజయ్, ధనరాజ్, భరత్, సలీం మహమ్మద్ రఫీక్, గంగాధర గౌళికి మరణశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున జరిమానా విధించారు. తీర్పు నేపథ్యంలో గంగావతి కోర్టు వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 2025 అక్టోబర్ 7న గంగావతి పట్టణంలో వెంకటేశ్ కురుబర దారుణ హత్యకు గురయ్యారు. ఓ కార్యక్రమం ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తున్న వెంకటేశ్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులు, అనంతరం మారణాయుధాలతో అత్యంత కిరాతకంగా దాడి చేసి చంపేశారు. వ్యక్తిగత కక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. 2003 నాటి ఒక పాత కేసులో వెంకటేశ్ పోలీసులకు సహకరించడంతో ప్రధాన నిందితుడు రవి పగ పెంచుకుని ఈ హత్యకు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో మొత్తం 12 మందిని అరెస్టు చేయగా, పోలీసులు 927 పేజీల ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. విచారణలో భాగంగా 83 మంది సాక్షులను విచారించిన కోర్టు, సాక్ష్యాధారాలు లేకపోవడంతో ఆరుగురిని నిర్దోషులుగా విడుదల చేసి, మిగిలిన ఆరుగురిని దోషులుగా నిర్ధారించింది.

## నర్మదా నదిలో ఘోర విషాదం

### పర్యాటకుల బోటు బోల్తా.. ఏడుగురి మృతి

- ఆకస్మిక తుఫాను కారణంగానే ప్రమాదం
- ప్రాణాలతో బయటపడిన 15 మంది పర్యాటకులు
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**జబల్‌పూర్ మే 1 (నినాదం) :** మధ్యప్రదేశ్‌లో నర్మదా నదిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. జబల్‌పూర్‌లోని బార్గీ డ్యామ్‌లో పర్యాటకులతో వెళ్తున్న ఒక క్రూయిజ్ బోటు మునిగిపోయింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, పలువురు గల్లంతయ్యారు. ఆనందంగా సాగాల్సిన విహారయాత్ర ఈ ఘటనతో క్షణాల్లో పెను విషాదంగా మారింది. మధ్యప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన ఈ క్రూయిజ్ బోటులో ప్రమాద సమయంలో 29 మంది పర్యాటకులు ఉన్నారు. జబల్‌పూర్‌లోని ఖమారియా ద్వీపం సమీపంలోకి రాగానే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బలమైన గాలులతో కూడిన తుఫాను రావడంతో బోటు అదుపుతప్పి నీటిలో మునిగిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 15 మంది పర్యాటకులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర విపత్తు స్పందన దళం (SDRF) బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇప్పటివరకు ఇద్దరు మహిళలతో సహా



ఏడుగురి మృతదేహాలను వెలికితీశారు. మరో 8 మంది ఆచూకీ లభించకపోవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. బోటు కెప్టెన్ లైఫ్ జాకెట్ ధరించి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. చీకటి పడటంతో సెర్చ్‌లైట్ల వెలుగులో రాత్రంతా గాలింపు కొనసాగించారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, పీడబ్ల్యూడీ మంత్రి రాకేష్ సింగ్ ఎన్డీటీవీతో మాట్లాడుతూ, "SDRF బృందాలు సుమారు 10 మందిని కాపాడాయి. క్రూయిజ్ కంపెనీ తప్పు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మా ప్రాధాన్యత సహాయక చర్యలకే" అని తెలిపారు. గాయపడిన వారిని జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాఘవేంద్ర సింగ్, ఎస్పీ సంపత్ ఉపాధ్యాయ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## ఏపీలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు కళ్లెం.. 80కిలోమీటర్లు దాటితే అడ్డంగా దొరికిపోతారు!

- ఏపీలో ప్రైవేట్ బస్సుల ప్రమాదాలపై ప్రభుత్వం సీరియస్
- ట్రావెల్స్ బస్సులకు గంటకు 80 కిలోమీటర్ల వేగ పరిమితి
- జీపీఎస్ ద్వారా బస్సుల వేగాన్ని పర్యవేక్షిస్తున్న రవాణా శాఖ
- నిబంధనలు అతిక్రమించి అతివేగంగా వెళ్తే బస్సులను సీజ్ చేస్తున్న అధికారులు
- అధికారుల చర్యలతో ట్రాక్‌లోకి వస్తున్న ట్రావెల్స్ యాజమాన్యాలు

**అమరావతి, మే 1 (నినాదం) :** ఏపీలో ఇటీవల జరిగిన వరుస ప్రైవేట్ బస్సు ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల అతివేగానికి కళ్లెం వేయడమే లక్ష్యంగా, జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఇకపై ఏ ట్రావెల్స్ బస్సు అయినా గంటకు 80 కిలోమీటర్ల వేగాన్ని మించి ప్రయాణించడానికి వీల్లేకుండా నిబంధనలను కఠినతరం చేశారు. రాష్ట్రంలో ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) కింద సుమారు 1800 బస్సులు రిజిస్టర్ కాగా, ఇప్పటివరకు 1,660 బస్సులకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానం చేశారు. ఈ టెక్నాలజీ ద్వారా ఏ బస్సు ఎక్కడ, ఎంత వేగంతో ప్రయాణిస్తుందో అధికారులు తమ కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు. ఏదైనా బస్సు 80 కిలోమీటర్ల వేగ పరిమితిని ఉల్లంఘించినట్లు జీపీఎస్ ద్వారా నిర్ధారణ అయితే, అధికారులు తక్షణమే ఆ బస్సును సీజ్ చేస్తున్నారు. అనంతరం ఆ బస్సును ఆటోమేటెడ్




టెస్టింగ్ స్టేషన్‌కు (ఏటీఎస్) తరలించి, దాని స్పీడ్ లిమిట్ పరికరం పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. ఈ పర్యవేక్షణ కేవలం ఏపీ సరిహద్దులకే పరిమితం కాలేదు. ఉదాహరణకు విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు తెలంగాణలో ప్రయాణిస్తున్నప్పటికీ, దాని వేగాన్ని ఏపీ రవాణా శాఖ అధికారులు ట్రాక్ చేస్తారు. గతంలో మోటారు వాహన చట్టం ప్రకారం బస్సుల్లో స్పీడ్ లిమిట్ పరికరాలు ఉన్నప్పటికీ, చాలా ట్రావెల్స్ యాజమాన్యాలు వాటిని పనిచేయకుండా చేసి అతివేగంతో బస్సులను నడిపేవారు. ఈ సమస్యను అధిగమించడానికే ప్రభుత్వం జీపీఎస్ ట్రాకింగ్‌ను తప్పనిసరి చేసింది. రవాణా శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం బస్సుల కదలికలను గమనిస్తున్నారు. అధికారుల కఠిన వైఖరి, బస్సులను సీజ్ చేస్తుండటంతో ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలు పాటించడం మొదలుపెట్టాయి. దీంతో చాలా బస్సులు పరిమిత వేగంతోనే నడుస్తుండటంతో, రోడ్డు ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## రేపు అమరావతిలో మొబైల్ ఫోన్లకు ఈ సందేశం వస్తే కంగారు పడకండి!

- ఇది కేవలం పరీక్షేనని, ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారుల సూచన
- విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడమే ఈ వ్యవస్థ లక్ష్యం

**అమరావతి, మే 1 (నినాదం) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులకు రేపు (మే 2 శనివారం) ఒక ప్రత్యేక హెచ్చరిక సందేశం రానుంది. పెద్ద బీప్ సౌండ్‌తో కూడిన ఈ సందేశం చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ప్రయోగాత్మకంగా పరీక్షించడంలో భాగమేనని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా అత్యవసర హెచ్చరికల వ్యవస్థను బలోపేతం చేసేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ) ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వెల్లడించింది. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 11:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల మధ్యలో ఏపీ రాజధాని ప్రాంతాల్లోని అన్ని మొబైల్ ఫోన్లకు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీ ద్వారా ఒక టెస్ట్ మెసేజ్ పంపనున్నారు. విపత్తుల సమయంలో ప్రజలను తక్షణమే అప్రమత్తం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశారు. "అప్రమత్తమైన పౌరులు, సురక్షితమైన దేశం" అనే నినాదంతో ఈ వ్యవస్థ పనిచేస్తుంది. "ఇది భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ విభాగం ద్వారా పంపబడిన నమూనా పరీక్ష సందేశం. దయచేసి ఈ సందేశాన్ని విస్మరించండి. మీ వైపు నుంచి ఎటువంటి చర్య అవసరం లేదు" అనే సమాచారంతో ఈ ఫ్లాష్ మెసేజ్ మొబైల్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ పరీక్ష ద్వారా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని, హెచ్చరికలు చేరే వేగాన్ని అధికారులు అంచనా వేస్తారు. భవిష్యత్తులో తుపానులు, భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు తక్షణ సమాచారం అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడనుంది.

EVENING 6 PM 04

# నినాదం

తెలుగు దిన పత్రిక


నిఖార్సైన జర్నలిజం

డిజిటల్ ఎడిషన్

శుక్రవారం మే 01 2026 ninadam.in


# దేశంలో కొత్త శకం.. ఇక టోల్ ప్లాజాలో ఆగక్కర్లేదు!

- దేశంలో తొలి బారియర్-ఫ్రీ టోల్ ప్లాజా ప్రారంభం
- సూరత్ సమీపంలో ఆగకుండానే టోల్ చెల్లించే విధానం
- ఫాస్ట్‌ట్యాగ్, నంబర్ ప్లేట్ రీడింగ్ ద్వారా ఆటోమేటిక్‌గా వసూలు
- 2026 చివరి నాటికి దేశవ్యాప్తంగా అమలుకు కేంద్రం ప్రణాళిక
- ట్రాఫిక్ రద్దీకి చెక్, భారీగా ఇంధనం ఆదా అయ్యే అవకాశం




**ఢిల్లీ మే 1 (నినాదం) :** దేశంలో టోల్ వసూళ్ల విధానంలో ఒక విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు. వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగకుండానే ప్రయాణించేందుకు వీలు కల్పించే భారతదేశపు మొట్టమొదటి బారియర్-ఫ్రీ టోల్ ప్లాజా కార్యకలాపాలు ప్రారంభించింది. ముంబై-ఢిల్లీ జాతీయ రహదారి (NH48)పై సూరత్ సమీపంలోని చోర్యాసి టోల్ ప్లాజా వద్ద ఈ అధునాతన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఫిబ్రవరి 2 నుంచి దాదాపు రెండు నెలల పాటు విజయవంతంగా పరీక్షించిన తర్వాత దీనిని పూర్తిస్థాయిలో ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో టోల్ ప్లాజాల వద్ద భౌతికంగా అడ్డంకులు (బారియర్లు) ఉండవు. మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో (MLFF) టెక్నాలజీ ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) దీనిని అమలు చేస్తోంది. వాహనాలు టోల్ ప్లాజా వద్దకు రాగానే, పైన ఏర్పాటు చేసిన గ్యాంట్రీలపై ఉన్న హై-రిజల్యూషన్ కెమెరాలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ANPR) టెక్నాలజీతో వాహనం నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేస్తాయి. అదే సమయంలో, RFID సెన్సార్లు ఫాస్ట్‌ట్యాగ్ వివరాలను గ్రహించి, లింక్ అయిన బ్యాంకు ఖాతా నుంచి టోల్ రుసుమును ఆటోమేటిక్‌గా మినహాయిస్తా యి. ఈ ప్రక్రియ మొత్తం వాహనం ఆగకుండానే జరిగిపోతుంది. "ఈ బారియర్-లెస్ టోలింగ్‌తో వాహనాన్ని ఎక్కడా ఆపాల్సిన అవసరం లేదు. వాహనం గ్యాంట్రీ కింద నుంచి వెళ్లగానే టోల్ రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది" అని ఎన్‌హెచ్ఏఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎ.ఆర్. చిత్రాన్ని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా వాహనాలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో కూడా టోల్ ప్లాజాను దాటి వెళ్లవచ్చు. దీనివల్ల టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీ, పొడవైన క్యూలు తగ్గుతాయి. ఒకవేళ వాహనానికి ఫాస్ట్‌ట్యాగ్ లేకపోయినా లేదా పనిచేయకపోయినా, నంబర్ ప్లేట్ ఆధారంగా వాహనాన్ని గుర్తించి, రిజిస్టర్డ్ యజమానికి టోల్ చెల్లించమని ఎలక్ట్రానిక్ నోటీసు పంపిస్తారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించిన ప్రకారం, 2026 చివరి నాటికి దేశవ్యాప్తంగా 1,050కి పైగా టోల్ ప్లాజాలను ఏఐ ఆధారిత బారియర్-ఫ్రీ వ్యవస్థలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల ఏటా రూ.1,500 కోట్ల ఇంధనం ఆదా అవ్వడంతో పాటు, మెరుగైన వసూళ్ల ద్వారా ప్రభుత్వానికి అదనంగా రూ.6,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## కేరళలో దారుణం.. తల్లి, సోదరుడిని చంపి ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టిన వ్యక్తి!

- ఎకరం భూమి పంపకాల వివాదమే హత్యలకు కారణం
- ఆటో డ్రైవర్ అనుమానంతో రంగంలోకి దిగిన పోలీసులు
- నిందితుడి తండ్రి అదృశ్యం కేసును కూడా తిరగదోడుతున్న అధికారులు





**ఇడుక్కి మే 1(నినాదం):** కేరళలోని ఇడుక్కి జిల్లాలో ఆస్తి కోసం కన్నతల్లి, సోదరుడిని ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా హత్య చేసి, వారి మృతదేహాలను ఇంట్లోనే పూడ్చిపెట్టిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ జంట హత్యల కేసులో నిందితుడైన సజీ (45)ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన వివాదాలే ఈ ఘోరానికి దారితీశాయని ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

**అసలేం జరిగిందంటే..!**

పొన్నూట్టిల్ కుటుంబానికి చెందిన సజీ, అతని సోదరుడు రెజీ (40), తల్లి మేరీకుట్టి (65)తో కలిసి నివసిస్తున్నాడు. కుటుంబానికి చెందిన సుమారు ఎకరం భూమిని పంచుకోవడంపై సోదరుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఒకరోజు రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రెజీతో సజీకి వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో రెజీ ముఖంపై సజీ తీవ్రంగా దాడి చేశాడు. అతను స్పృహ కోల్పోయిన తర్వాత టవల్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యను చూసిన కన్నతల్లి మేరీకుట్టిని కూడా ముఖంపై కొట్టి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు.

రెండు రోజుల పాటు మృతదేహాలను ఇంట్లోనే దాచిపెట్టి, ఆ తర్వాత ఇంటి ఆవరణలోనే గొయ్యి తీసి పూడ్చిపెట్టాడు. ఈ హత్యలు చేయడంలో తనకు ఎవరూ సహాయం చేయలేదని, ఒక్కడినే ఈ ఘాతుకానికి పాల్పడ్డానని సజీ పోలీసుల ఎదుట అంగీకరించినట్లు సమాచారం.

**ఆటో డ్రైవర్ అనుమానంతో వెలుగులోకి...**

దాదాపు నెల రోజుల నుంచి మేరీకుట్టి, రెజీ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారికి సజీ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. అయితే, అనారోగ్యంతో ఉండే మేరీకుట్టిని తరచూ ఆసుపత్రికి తీసుకువెళ్లే ఓ ఆటో డ్రైవర్‌కు అనుమానం వచ్చింది. రెజీ చేసే పనులను సజీ చేస్తుండటంతో అతనికి అనుమానం బలపడింది. ఈ విషయాన్ని అతను అనక్కరలో నివసిస్తున్న వారి సోదరి సినికి తెలియజేశాడు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది.

పోలీసులు సోమవారం సజీ ఇంటికి చేరుకోగా, వారిని చూసి అతను పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం బలపడిన పోలీసులు ఇంటి ఆవరణలో తవ్వకాలు జరపగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. నిందితుడు సజీని మంగళవారం అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కాగా, 2018లో వీరి తండ్రి మాథ్యూ కూడా అదృశ్యమయ్యాడు. ఆ ఘటనతో ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### బర్త్ డే పార్టీలో ముఖానికి కేక్ పూశారని ముగ్గురి హత్య..


## ఎన్‌కౌంటర్ లో నిందితుడి మృతి

- బర్త్ డే పార్టీలో ముగ్గురు కుటుంబ సభ్యులను కాల్చి చంపిన నిందితుడు
- నిందితుడు జీతూ సైనీ తలపై రూ. 50 వేల రివార్డు
- ఎదురు కాల్పుల్లో నిందితుడికి గాయాలు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



**బులంద్‌షహర్ మే 1 (నినాదం) :** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో సంచలనం సృష్టించిన ట్రిపుల్ మర్డర్ కేసులో ప్రధాన నిందితుడు జీతూ సైనీ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అతడిపై రూ.50,000 రివార్డు ఉంది. కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అతడిని గురువారం తెల్లవారుజామున పోలీసులు కాల్చి చంపారు. అధికారుల కథనం ప్రకారం ధరౌ పోలీస్ అవుట్‌పోస్ట్ సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపమని కోరారు. అయితే, వారు ఆగకుండా పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని ఝూజర్ రోడ్డులో చుట్టుముట్టగా, నిందితులు కాల్పులు కొనసాగించారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడు గాయపడగా, మరొకరు చీకటిని ఆసరాగా చేసుకుని తప్పించుకున్నాడు.గాయపడిన జీతూ సైనీని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి ఒక పిస్టల్, బుల్లెట్లు, నంబర్ ప్లేట్ లేని స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 25న ఖుర్జాలో జరిగిన పుట్టినరోజు వేడుకలో అమర్‌దీప్ (30), మనీశ్ (28), ఆకాశ్ (18) అనే ముగ్గురు కుటుంబ సభ్యులను కాల్చి చంపిన కేసులో జీతూ సైనీ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. పుట్టినరోజు జరుపుకుంటున్న జీతూ సైనీ ముఖానికి మృతులు సరదాగా కేక్ పూయడమే ఈ ఘర్షణకు కారణమైంది. ఈ చిన్న విషయంపై మాటామాటా పెరిగి, నిందితులు ఆయుధాలతో తిరిగి వచ్చి కాల్పులకు తెగబడ్డారు. పోలీసుల చర్యపై మృతుల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితుల ఆస్తులను కూల్చివేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా సైనీ నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

### మహబూబ్ నగర్ జిల్లాలో దారుణం... నవజాతశిశువును పీక్కుతిన్న వీధికుక్కలు



**మహబూబ్ నగర్ మే 1 (నినాదం) :** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో దారుణం జరిగింది. నవజాత శిశువును వీధికుక్కలు పీక్కుతిన్న విషాదకర సంఘటన చోటు చేసుకుంది. జడ్చర్ల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని గుట్ట పక్కన గుర్తు తెలియని వ్యక్తులు నవజాత శిశువును పడవేసి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న వీధికుక్కలు ఆ శిశువును కొరికి తినేశాయి. శిశువు శరీర భాగాలను గుర్తించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏం జరిగింది, నవజాత శిశువును గుట్ట పక్కన పడేసింది ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి




**మంచిర్యాల, మే 1 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మే డే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఉన్న ఏఐటీయూసీ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, వాసిరెడ్డి సీతారామయ్య , ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వలేని ప్రభుత్వాలు ఈరోజు అధికారంలో ఉండటం సిగ్గు చేటన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేయి రూపాయలు వేతనం ఇస్తున్న ప్రభుత్వాలు దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది అని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు. 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు,కార్యదర్శి కలిందర్ అలీ ఖాన్, వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య,దేవి పోచన్న,మధు , రాయమల్లు, రాకేష్, ప్రశాంత్, రాజేశ్వరి, షీలా, పద్మ,నర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


## దివాకరన్న పెరుగన్నం ప్రారంభం



**మంచిర్యాల, మే 1(నినాదం):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివాకరన్న పెరుగన్నం కేంద్రాన్ని నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పెరుగన్నం తో చలువ ఉంటుందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య , నస్పూర్ పట్టణ అధ్యక్షులు అక్కూరి సుబ్బన్న , కార్పొరేటర్లు గుమ్మడి శ్రీనివాస్, అబ్దుల్ సత్తార్, పెట్టాం స్వరూప-లక్ష్మణ్ , నాయకులు గోగుల రవీందర్ రెడ్డి , మంచిర్యాల మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్ , టీబీజీకేఎస్ నాయకులు కేతేరెడ్డి సురేందర్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మీడియా ముందుకు మరోసారి సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్

- ఆపరేషన్ సిందూర్ తర్వాత మీడియా ముందుకు వచ్చిన అధికారిణులు
- ఇప్పుడు మరోసారి రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడి
- వారితో పాటు నేవీ కమాండర్ కూడా మీడియా ముందుకు..




**ఢిల్లీ మే 1 (నినాదం) :** కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మరోసారి మీడియా ముందుకు రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గత సంవత్సరం పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో, భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ వివరాలను వెల్లడించేందుకు ఈ ఇద్దరు అధికారిణులు మీడియా ముందుకు వచ్చారు. వీరిద్దరు మరోసారి మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వీరితో పాటు నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో వారు ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి మాట్లాడే అవకాశముంది. సోఫియా ఖురేషీ గుజరాత్‌కు చెందినవారు. బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లలో సైన్యంలో చేరారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా పని చేశారు. 2019లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదాను పొందారు. మే 7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది పూర్తవుతుండడంతో వీరు మీడియా ముందుకు వస్తున్నట్టు తెలుస్తోంది.

## 2025 సంవత్సరానికి ఎలాన్ మస్క్ వేతన ప్యాకేజీ రూ.15 లక్షల కోట్లు..!



**వాషింగ్టన్, మే 1 (నినాదం) :** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 2025 ఆర్థిక సంవత్సరానికి గాను 158 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీని పొందారు. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆయన ప్యాకేజీని కంపెనీ పేర్కొంది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.15 లక్షల కోట్లు. ఎలాన్ మస్క్ నెలవారీ వేతనంగా ఎలాంటి మొత్తాన్ని పొందడం లేదు. స్టాక్ అవార్డులు, ఇతరత్రా రూపంలో పారితోషిక ప్యాకేజీని అందుకుంటారు. ఈ క్రమంలో గత సంవత్సరానికి గాను ఆయన ప్యాకేజీని టెస్లా ప్రకటించింది. అయితే ప్రకటించిన మొత్తంతో పోలిస్తే ఆయన పొందే విలువలో చాలా వ్యత్యాసం ఉంటుందని కూడా టెస్లా తన ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ పనితీరు ఆధారిత పారితోషికం విలువ 132 బిలియన్ డాలర్లుగా ఉంది. పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరితేనే ఈ మొత్తం మస్క్‌కు అందుతుంది. అలాగే ప్యాకేజీలో మిగతా 26 బిలియన్ డాలర్లు కూడా టెస్లా బోర్డు ఆమోదిస్తేనే అందుతుంది.

### అసోం సీఎం భార్యపై ఆరోపణల కేసు...

## పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఊరట

- ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు



**ఢిల్లీ మే 1 (నినాదం) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ భార్య రిణికి భూయాన్ శర్మపై అనుచిత వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి గౌహతి హైకోర్టు నిరాకరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందస్తు బెయిల్ ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది. తనకు పలు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలపై రిణికి భూయాన్ శర్మ గౌహతిలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా అభ్యర్థించగా, గౌహతి హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పవన్ ఖేరా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు.

## పెట్రో ధరలు పెంచడం లేదు

- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడి




**న్యూఢిల్లీ, మే 1 (నినాదం):** దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉ ంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా ధరలను నియంత్రణలో ఉంచడం గమనార్హం.

## పైలట్లకు విశ్రాంతిపై నిబంధనలు బేఖాతరు

- ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆందోళన



**న్యూఢిల్లీ, మే 1 (నినాదం):** పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు లేఖ రాసింది. ఇటీవల విధుల్లో ఉ ండగానే పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో విమాన భద్రత, నియంత్రణ, విమాన సిబ్బంది శ్రేయస్సు వంటి విషయాల్లో ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో పలు విజ్ఞప్తులు చేసినప్ప టికీ.. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించే నిబంధనలను నిరంతరం వాయిదా వేయడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పైలట్స్ అసోసియేషన్ పేర్కొంది. విమానయాన సంస్థలకు నిరంతరం మినహాయింపు లను మంజూరుచేస్తుండడం ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నీరుగార్చిందని తెలిపింది. తాత్కాలిక చర్యలుగా ప్రవేశపెట్టిన ఈ సడలింపుల వల్ల పైలట్లకు విశ్రాంతి ఉండట్లేదని పేర్కొంది. దీనివల్ల వారు మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెంటనే అమలుచేయడానికి మార్గదర్శకాలు రూపొందించాలని డీజీసీఏను కోరింది.

## ఈ ఒక్క ఏడాదే రూ.2 లక్షల కోట్ల కొత్త ఆస్తులు

- అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సంచలన ప్రకటన
- 35 ఏళ్లలో సాధించిన వృద్ధిని ఈ ఒక్క ఏడాదే అందుకుంటామని వెల్లడి
- దేశ నిర్మాణంలో భాగంగా పలు కీలక ప్రాజెక్టులు చేపడుతున్నామని స్పష్టీకరణ
- ప్రధాని మోదీ 'వికసిత భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తామన్న అదానీ



**న్యూఢిల్లీ, మే 1 (నినాదం):** అదానీ గ్రూప్ తమ వ్యాపారాల్లో వేగవంతమైన వృద్ధిని కొనసాగిస్తూ ఈ ఒక్క సంవత్సరంలోనే కొత్తగా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను సమకూర్చుకోనున్నట్లు గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ సంచలన ప్రకటన చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రూప్‌లోని 4 లక్షల మంది ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిచిన 35 ఏళ్లలో తాము సుమారు రూ.2 లక్షల కోట్ల ఆస్తులను నిర్మించామని, కానీ ఇప్పుడున్న తమ సామర్థ్యంతో ఈ ఒక్క ఏడాదిలోనే మరో రూ.2 లక్షల కోట్ల ఆస్తులను జోడించబోతున్నామని ఆయన ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. తాము చేపట్టే ప్రాజెక్టులు కేవలం పనులు పూర్తి చేయడం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడమేనని ఆయన అన్నారు. ముంద్రా పోర్టు, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి ప్రాజెక్టులను ఉదాహరణగా చూపుతూ, ఇవి దేశ నిర్మాణంలో కీలకమైనవని పేర్కొన్నారు. పలు కీలక ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఒకప్పుడు బీడుభూమిగా ఉండి, ఇప్పుడు దేశంలోనే అతిపెద్దదైన ముంద్రా పోర్టు, కేరళలోని విళింజం పోర్టులు దేశ వాణిజ్యాన్ని, అంతర్జాతీయ సముద్ర వాణిజ్య పటంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. కచ్‌లోని ఖవ్డాలో నిర్మిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఇంధనాన్ని అందిస్తుందన్నారు. అలాగే, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని, ఇటీవల ప్రారంభమైన గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఉత్తరప్రదేశ్‌లో 8 కోట్ల మంది ప్రజల జీవితాలను మార్చబోతోందని వివరించారు. మీరట్-ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 10-11 గంటల నుంచి 5-6 గంటలకు తగ్గుతుందని తెలిపారు. ముంబైలోని ధారవి మురికివాడల పునరాభివృద్ధి ప్రాజెక్టును కేవలం ఒక ప్రాజెక్టుగా కాకుండా, మానవ పరివర్తనలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత సవాలుతో కూడిన ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. దేశ నిర్మాణంలో భాగంగా తాము చేపడుతున్న ఈ ప్రాజెక్టులన్నీ తమ వంతు వినయపూర్వకమైన సేవ అని గౌతమ్ అదానీ పేర్కొన్నారు.